క్లుప్తంగా

పారిశుధ్యం మెరుగుపర్చాలి



మేస్త్రీలు, కార్మికులతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప

రాయదుర్గంటౌన్: పారిశుధ్యం మెరుగులో అలసత్వం తగదని మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప సూచించారు. మంగళవారం పాత మున్సిపల్ కార్యాలయం వద్ద మస్టర్‌ను పరిశీలించారు. అనంతరం శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీంద్ర యాదవ్, మేస్త్రీలు, సచివాలయ శానిటరీ సెక్రటరీలు, కార్మికులతో మాట్లాడారు. ఇటీవల పారిశుధ్య నిర్వహణపై పలు ఫిర్యాదులు వస్తున్నట్లు చెప్పారు. ఇంటింటా చెత్త సేకరణ పక్కాగా జరగాలన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా చెత్త సేకరణతోపాటు కాలువల్లో పూడిక తీత క్రమంగా జరగాలన్నారు. వార్డుల్లో ఎక్కడా సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

కళ్యాణదుర్గం రూరల్: మున్సిపల్ కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట చేసిన ధర్నాలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అచ్యుత్ ప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని, అధికారం చేపట్టాక కార్మికుల సమస్యలు పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో నాయకుడు కార్యదర్శి వన్నూరుస్వామి, తిమ్మప్ప, ప్రకాష్, అలివేలమ్మ, నటరాజ్, ఎస్ఎఫ్ఐ నాయకుడు భవిత్ పాల్గొన్నారు.

మొక్కలు విరివిగా పెంచాలి



మొక్క నాటుతున్న గవిమఠం ఉత్తరాధికారి కరిబసవ రాజేంద్రస్వామి

ఉరవకొండ: మొక్కలు విరివిగా పెంచాలని గవిమఠం ఉత్తరాధికారి డాక్టర్ కరిబసవ రాజేంద్రస్వామి పిలుపునిచ్చారు. మంగళవారం జైకిసాన్ సంస్థ ఆధ్వర్యంలో పలు ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో మొక్కలు నాటారు. జైకిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నాగమల్లి ఓబుళేసు ఆధ్వర్యంలో గవిమఠం ఉత్తరాధికారి చేతుల మీదుగా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఉత్తరాధికారి మాట్లాడుతూ ఏప్రిల్ ఫూల్స్ డేకాదు.. కూల్స్‌డేగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. ప్రతి ఒక్కరూ ఒక గిన్నెలో నీరు, మరో గిన్నెలో గింజలు వేసి ఇళ్లపైన ఉంచాలన్నారు.

ముగిసిన వడ్డీ రాయితీ గడువు

రాయదుర్గంటౌన్: ఆస్తి, నీటి, కొళాయి పన్ను వసూళ్లలో రాయదుర్గం మున్సిపాలిటీ జిల్లాలో తాడిపత్రి తర్వాత వసూళ్లలో రెండో స్థానంలో నిలిచింది. మున్సిపల్ కార్యాలయంలో సెలవు దినాలైనా ప్రత్యేక కౌంటర్ల ద్వారా పన్ను స్వీకరించారు. ఆర్థిక సంవత్సరం మార్చి 31 నాటికి రూ.4.44 కోట్ల ఆస్తి పన్ను బకాయి ఉండగా, రూ.3.37 కోట్లు వసూలు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి తెలిపా రు. 75.95 శాతం వసూళ్లలో జిల్లాలోనే రెండో స్థానంలో నిలిచినట్లు చెప్పారు. రూ.4.61 కోట్ల నీటి, కొళాయి పన్ను వసూలు చేయాల్సి ఉండగా రూ.2.29 కోట్లు వసూలు చేసి 50 శాతంతో జిల్లాలో రెండో స్థానం సాధించినట్లు తెలిపారు.



వరి అనంతరం రాగి సాగుచేసిన కెంచంపల్లి రైతు రాయుడు



వక్క,తమలపాకు సాగు చేసిన వెంకటంపల్లి రైతు కృష్ణారెడ్డి



మొక్కజొన్న అనంతరం వేరుశనగ సాగుచేసిన రైతు గోవిందప్ప

పంట మార్పిడి.. లాభాల నూర్పిడి

- తగ్గనున్న పెట్టుబడి వ్యయం
- అన్నదాతకు అదనపు ఆదాయం

కుందుర్పి: పంటల మార్పిడితోనే తెగుళ్లు, చీడపీడలు నివారించొచ్చని, అధిక దిగుబడి సాధించొచ్చని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. తద్వారా ఎరువులు, పురుగు మందుల ఖర్చులు కూడా తగ్గుతాయని చెప్తున్నారు. ప్రస్తుతం పంటల స్థానంలో ఏ పంటలు సాగు చేస్తే వచ్చే లాభాలేమిటో వారు తెలియజేశారు. ఎప్పుడూ ఒకే రకమైన పంటలు సాగు చేయడం సరికాదని, తద్వారా చీడపీడలు వ్యాపించి, దిగుబడిపై ప్రభావం పడుతుందని చెప్తున్నారు. ఏటా పంట మార్పిడితో రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని, కొన్ని పంటలకు తెగుళ్లు, పురుగులు ఎక్కువగా ఆశిస్తాయన్నారు. చీడపీడలు ఆశించని పంటలు ఎంచుకొని పంటలు సాగుచేస్తే మంచి దిగుబడులు వస్తాయని తెలియజేస్తున్నారు.

పంటమార్పిడి విధానం ఇలా..

- ప్రస్తుతం రబీ పంటలు సైతం 40 శాతం పూర్తి కావస్తున్నాయి. రబీ పంటలు రబీ సీజన్‌లో నీటి తడులతో ఇబ్బంది ఉంటోంది. అందువల్ల వరికి బదులు పెసలు,రాగి, వేరుశనగ, నూనె గింజలు సాగు చేసుకోవడం మంచిది.
- తమల పాకుల తోటల్లో ఎండు తెగుళ్లు, మొదలు కుళ్ల తెగులు వ్యాపించినప్పుడు కనీసం మూడేళ్ల కోసారైనా మొక్కజొన్న పంట సాగు చేస్తే మంచిది.
- వంగ పంటలో ఆశించే ఎండు తెగులను నివారించడం కష్టం. తద్వారా ఈ తెగులు సోకిన నేలలో కాలీ ఫ్లవర్ పంట సాగుచేసుకోవచ్చు. వంగలో నులి పురుగు ఎక్కువగా ఉంటే బంతిపూలు సాగు చేయాలి.
- కూరగాయలు, తీగజాతి కూరల తెగుళ్ల నివారణకు పంట మార్పిడిగా వరి సాగు చేయడం మంచిది. మొక్కజొన్న పంట తరువాత సేంద్రియ ఎరువులు వాడి, ఏదైనా పంట సాగు చేసుకోవచ్చు.
- మిరప కాలిఫ్లవర్, వేరుశనగ, పంటలకు ఆశించే లద్దెపురుగు నివారణకు ఆ పంట పూర్తి అయ్యాక సజ్జ, జొన్న, వరి, పొద్దుతిరుగుడు తదితర ఆరుతడి పంటలతో పంట మార్పిడి చేసుకోవాలి. ఆవాలు, బంతిపూలు వంటి పైర్లను సాగుచేసి ఆకుముడత ను నివారించొచ్చు.

పంట మార్పిడి తప్పనిసరి



పంటల సాగు తరచూ మారుస్తుండాలి. ఒకే రకమైన పంటలు సాగు చేస్తే తెగుళ్లు సోకడంతో పాటు చీడపీడలు భూమిలో అలాగే ఉండి పోతాయి. టమాట,వంగ, మిరప, బెండ వంటి పంటలు ఒకే రకమైనవి. ఇవి ఒకదాని తర్వాత ఒకటి వేయడంతో గత పంటకు ఉన్న తెగుళ్లు మరో పంటకు సోకుతాయి.

– యల్లప్ప, కళ్యాణదుర్గం ఏడీఏ

కూటమి ప్రభుత్వానికి రైతుల గోడు కనిపించలేదా?

- వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్ ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్

ఉరవకొండ: ఆర్థిక మంత్రి హోదాలో ఉంటూ తీవ్ర కరువుతో అల్లాడుతున్న ఉరవకొండ నియోజకవర్గంలో రెండు మండలాలనే కరువు మండలాలుగా ఎలా ప్రకటిస్తారని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాకెట్ల అశోక్, నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు మోపిడి మేకల సిద్దార్థ్ ప్రశ్నించారు. మంగళవారం స్థానిక వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. రబీ సీజన్‌కు సంబంధించి ప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాల జాబితాలో నియోజకవర్గంలోని విడపనకల్, బెళుగుప్ప మండలాలను మాత్రమే చేర్చారన్నారు. జిల్లాలోనే రబీలో అత్యధికంగా నియోజకవర్గంలోనే పప్పుశనగ సాగవుతుందన్నారు. అలాంటిది ఉరవకొండ, వజ్రకరూర్, కూడేరు మండలాల్లో ప్రభుత్వానికి, మంత్రి కేశవ్‌కు కరువు కనిపించలేదా? అని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం రైతు సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 40 శాతం సబ్సిడీతో పప్పుశనగ అందించినట్లు గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం 25 శాతం సబ్సిడీకే పరిమితం చేసినట్లు తెలిపారు. 2023–24లో వైఎస్ జగన్ ప్రభుత్వంలో రబీ సీజన్‌లో 17 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి రూ.37కోట్ల పరిహారం మంజూరు చేసినట్లు గుర్తు చేశారు. ఈ పరిహారాన్ని రైతు ఖాతాల్లో జమ చేసే సమయంలో ఎన్నికల కోడ్ వచ్చి ప్రక్రియ నిలిచిపోయిందన్నారు. కూటమి ప్రభుత్వం కనీసం రబీ పరిహారాన్ని కూడా రైతులకు ఇవ్వలేని పరిస్థితిలో ఉందన్నారు. ఇప్పటికైనా మంత్రి కేశవ్ స్పందించి ఉరవకొండ నియోజకవర్గంలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించేలా చొరవచూపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఈడిగ ప్రసాద్, పార్టీ రూరల్, మండల సమన్వయకర్తలు ఎర్రిస్వామి రెడ్డి, ఓబన్న, పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు బసవ రాజు, నాయకులు వేమన్న, శర్మాస్, మహానంది పాల్గొన్నారు.

ముగిసిన పదో తరగతి పరీక్షలు



బెళుగుప్పలో పరీక్షా కేంద్రం నుంచి బయటకు వస్తూ విజయకేతనం చూపుతున్న విద్యార్థులు



విద్యార్థుల హాజరు రిజిష్టర్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ వసంతబాబు

కూడేరు: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మంగళవారం ముగిశాయి. చివరి రోజు సోషల్ పరీక్ష 286 మంది కి గాను నలుగురు గైర్హాజరయ్యారు. కూడేరు హైస్కూల్ కేంద్రంలో 200 మందికిగాను 197 మంది, కేజీబీవీ కేంద్రంలో 86 మందికి గాను 85 మంది హాజరైనట్టు ఎంఈఓ మహమ్మద్ గౌస్ తెలిపారు.

బెళుగుప్ప: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, శ్రీనివాస విద్యానికేతన్ పాఠశాలల్లో పదో తరగతి పరీక్షలు మంగళవారం ముగిశాయని ఎంఈఓ మల్లారెడ్డి తెలిపారు. జెడ్పీహెచ్ఎస్ పరీక్ష కేంద్రంలో 220 మందికి గాను 212 మంది హాజరయ్యారన్నారు. శ్రీనివాస విద్యానికేతన్‌లో 209 మందికి గాను ముగ్గురు గైర్హాజరయ్యారని ఎంఈఓ తెలిపారు. చివరి రోజు విద్యార్థిని విద్యార్థులు పరీక్షలు ముగియడంతో ఉత్సాహంగా విజయకేతనం చూపుతూ బయటకు వచ్చారు.

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని శ్రీచైతన్య స్కూల్‌లో పదోతరగతి పరీక్ష కేంద్రాన్ని ఆర్డీఓ వసంతబాబు మంగళవారం తనిఖీ చేశారు. మంగళవారం పదో తరగతి విద్యార్థులకు చివరి పరీక్ష కావటంతో విద్యార్థులు ఉత్సాహంగా పరీక్ష రాశారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడికి పరామర్శ



వైఎస్సార్‌సీపీ నాయకుడు ఉలిగప్పను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

ఉరవకొండ: రాయంపల్లి గ్రామ వైఎస్సార్ సీపీ నాయకుడు బోయ ఉలిగప్పను మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి మంగళవారం పరామర్శించారు. ఉలిగప్ప అనారోగ్యంతో అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త విశ్వేశ్వరరెడ్డి ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. ఉలిగప్పతో ఆరోగ్య సమాచారం తెలుసుకున్నారు. ఉలిగప్ప సతీమణి వ్యాసాపురం గ్రామ ఎంపీటీసీ సభ్యురాలు నీలావతితో మాజీ ఎమ్మెల్యే మాట్లాడారు. అనంతరం ఆసుపత్రి వైద్యులను మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సీపీ వీరన్న పాల్గొన్నారు.

దేవరకు హాజరైన రంగయ్య



దేవరలో పాల్గొన్న రంగయ్య, నాయకులు

కళ్యాణదుర్గం రూరల్: ముద్దినాయనపల్లిలో మంగళవారం నిర్వహించిన దేవరకు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తలారి రంగయ్య హాజరయ్యారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు ఈశ్వరప్ప ఇచ్చిన విందులో వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఆయన పాల్గొన్నారు.జెడ్పీటీసీ బొమ్మన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి ములునూరు గోవిందు, డాక్టర్ల విభాగం జిల్లా అధ్యక్షుడు బొమ్మయ్య, కోఆర్డినేటర్ ఎర్రంపల్లి కృష్ణమూర్తి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ రఘునాథ్ రెడ్డి, యువజన నాయకులు నారాయణస్వామి, నాయకులు కామక్కపల్లి మల్లి, సత్తిరెడ్డి, శివయ్య, రామాంజనేయులు, నారాయణ స్వామి, ఎర్రిస్వామి, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఎండలు పెరుగుతున్నాయి.. జాగ్రత్త



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్

రాయదుర్గంటౌన్: పెరుగుతున్న ఎండల కారణంగా ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని, ప్రజలు జాగ్రత్తలు పాటించాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్ సూచించారు. మంగళవారం పట్టణంలోని 17వ వార్డు కేరమ్మకట్ట ఏరియాలో ప్రజలకు ఎండల వల్ల కలిగే వడదెబ్బ, వివిధ ఆరోగ్య సమస్యలకు కారణం, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. రోజూ 5 లీటర్ల నీటిని సేవించాలని, ఎండలో వెళ్లేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, తల తిరుగుట, వికారం, వాంతులు, చిన్న కురుపులు, కండరాల నొప్పులు, ముక్కు నుంచి రక్తం, తేలికపాటి లక్షణాలు ఉంటే వెంటనే ఆస్పత్రిని ఆశ్రయించాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సెక్రటరీ ప్రమీల, ఆశా కార్యకర్తలు పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ, పెన్షనర్ల సంఘం సమన్వయకర్తగా సింగాడి



ఉరవకొండ:వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నేత, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సింగాడి తిప్పయ్య వైఎస్సార్‌సీపీ ఉద్యోగ, పెన్షనర్ల సంఘం నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులయ్యారు. పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ప్రకటన విడుదలైంది. గతంలో ఉపాధ్యాయ సంఘాల రాష్ట్ర నాయకుడిగా, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా అనేక పదవుల్లో ఈయన కొనసాగారు. వైఎస్సార్ సీపీలో జిల్లా ఎస్సీసెల్ గౌరవ అధ్యక్షుడిగా, విడపనకల్లు మండల జెడ్పీటీసీగా పనిచేశారు. తిప్పయ్య మాట్లాడుతూ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

నీటి తొట్టెల నిర్మాణానికి చర్యలు

బెళుగుప్ప: మండలంలో నీటి తొట్టెల నిర్మాణానికి అధికారులు చర్యలు చేపట్టారు. మంగళవారం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, ఏపీఓ మురళీకృష్ణ స్థానికులతో కలసి పశువుల నీటి తొట్టెల నిర్మాణాలకు భూమి పూజ చేశారు. దుద్దేకుంటలో ఎంపీపీ పెద్దన్న, తగ్గుపర్తిలో సర్పంచ్ మౌనిక భూమి పూజ చేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో 93 నీటి తొట్టెల నిర్మాణాలను చేపట్టడం జరిగిందన్నారు. ప్రతి నీటి తొట్టె నిర్మాణానికి ఉపాధిహామీ పథకం కింద రూ.33,220 చొప్పున ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు.

వైభవంగా రససిద్ధేశ్వరస్వామి రథోత్సవం



సిద్ధుల కొండపై రససిద్ధేశ్వరస్వామి రథోత్సవం



మురడీలో ఆంజనేయస్వామి రథోత్సవంలో పాల్గొన్న అశేష జనం

రాయదుర్గంటౌన్: పట్టణ సమీపంలోని సిద్దుల కొండపై వెలసిన రస సిద్ధేశ్వర ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి స్వామి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని కోట పాళేగర్ వంశస్తుల తొలి పూజ అనంతరం పూజారుల ఇంటి వద్ద నుంచి స్వామి గుర్రాలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు. అంతకుముందు కోటలోని అమ్మవారి ఆలయం వద్ద నుంచి స్వామి గుర్రాలు, కలశ పూజలో వైఎస్సార్ సీపీ యువనేత మెట్టు విశ్వనాథ రెడ్డి, మండల కన్వీనర్ మేకల శ్రీనివాసులు, కౌన్సిలర్లు సంజీవప్ప, చేనేత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొరాళ్ల శివకుమార్, పైతోట రఘు హాజరై మొక్కులు తీర్చుకున్నారు. వేలాది మంది భక్తుల కోలాహలం మధ్య రథోత్సవాన్ని ఆలయ కమిటీ సభ్యులు నిర్వహించారు. బుధవారం సాయంత్రం సిడిమాను ఉత్సవం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

కనుల పండువగా అంజన్న రథోత్సవం

డి హీరేహాళ్ (రాయదుర్గం): డి హీరేహాళ్ మండలంలోని మురడిలో ఆంజనేయస్వామి రథోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. భక్తుల కరతాళ ధ్వనుల నడుమ గ్రామ పురవీధుల్లో స్వామి రథ చక్రాలు కదిలాయి. 'హనుమా' మము గనుమా.. అంటూ దివ్య స్వరూపుడి దర్శన భాగ్యం కోసం భక్తజనం వారది కట్టారు. వివిధ అభిషేకాలు, పూజలు, హోమాలు పూర్తిచేశాక ఆంజనేయుడి ఉత్సవ విగ్రహాన్ని వేదమంత్రోచ్చారణల మధ్య పల్లకీలో తీసుకొచ్చి రథంలో అధిష్టించారు. మహిళలు పొర్లు దండాలు పెట్టారు. ఈఓ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు రథం లాగి ఊరేగింపు మొదలుపెట్టారు. కార్యక్రమంలో ఆంధ్ర, కర్ణాటక నుంచి వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

నేడు లంకా దహనం..

ఉగాది ఉత్సవాల్లో భాగంగా బుధవారం మూడో రోజు ఆంజనేయస్వామి ఆలయంలో గండాదీపములు మోయడం, భక్తులకు అన్నదానం, పానకం పంపిణీ లాంటి కార్యక్రమాలు పూర్తయ్యాక రాత్రి 7 గంటలకు లంకా దహనం నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.



రాయదుర్గం: పూజలందుకున్న రససిద్ధేశ్వరస్వామి మూలవిరాట్



ప్రత్యేక అలంకరణలో మురడీ ఆంజనేయస్వామి



రాయదుర్గం: రససిద్ధేశ్వర కలశ పూజలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు

దేవతామూర్తులకు భక్తిశ్రద్ధలతో బోనాలు



జల్లిపల్లిలో లింగమయ్య స్వామి



అలంకరణలో బండూరు మారెమ్మదేవి

కూడేరు: మండలంలోని అరవకూరులో మంగళవారం ఉగాది పండుగను పురస్కరించుకొని గ్రామ దేవతలైన పోతులయ్య, పెద్దమ్మ, మారెమ్మ, ముత్యాలమ్మ, కుంటెమ్మ, సుంకలమ్మ దేవతామూర్తులకు గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో బోనాలు తీసుకెళ్లారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండాలని దేవతామూర్తులను గ్రామస్తులు వేడుకున్నారు.



బోనాలతో ఊరేగింపుగా తరలివెళ్తున్న భక్తులు



బొమ్మనహాళ్: గంగాజలాన్ని ఊరేగింపుగా తీసుకొస్తున్న దృశ్యం

లింగమయ్య స్వామి గ్రామోత్సవం

జల్లిపల్లిలో బంగారు లింగమయ్య స్వామి గ్రామోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. బోనాలను ఊరేగింపుగా లింగమయ్య స్వామి ఆలయానికి తీసుకెళ్లారు. స్వామికి నైవేద్యంగా ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. లింగమయ్య స్వామిని ప్రజలు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా మారెమ్మ జాతర

బొమ్మనహాళ్: మండలంలోని బండూరులో వెలసిన మారెమ్మదేవి అమ్మవారి జాతర వైభవంగా జరిగింది. ఏటా చైత్రమాసం ఉగాది అనంతరం వచ్చే మంగళవారం రోజున మారెమ్మ జాతరను గ్రామస్తులు ఘనంగా నిర్వహిస్తారు. వేకువజామున ఊరేగింపుగా వెళ్లి గంగాజలం తెచ్చి అభిషేకం నిర్వహించారు. అనంతరం పుష్పాలంకరణ చేసి, కుంభాభిషేకాలు నిర్వహించారు.

గౌరసంద్ర మారెమ్మ ఆలయంలో దీపోత్సవం



బెళుగుప్ప: గౌరసంద్రం మారెమ్మ ఆలయంలో దీపోత్సవంలో పాల్గొన్న భక్తులు

బెళుగుప్ప: మండల కేంద్రంలోని గౌరసంద్రం మారెమ్మ ఆలయంలో ఉగాది పండుగ పర్వదినాల్లో భాగంగా మంగళవారం దీపోత్సవ కార్యక్రమాన్ని భక్తులు ఆలయ సేవా కమిటీ సభ్యులు కలసి నిర్వహించారు. ఇందులోభాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. ఇదే విధంగా కాలువపల్లిలోని పెద్దమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, కొందరు భక్తులు దేవర నిర్వహించారు.

వైభవంగా అక్కమ్మ గార్ల జాతర

కంబదూరు: మండల కేంద్రంలో ఉగాది పండుగలో భాగంగా మంగళవారం అక్కమ్మగారి జాతర వైభవంగా జరిగింది. గ్రామస్తులు స్థానిక చెరువు కట్ట వద్ద ఉన్న అక్కమ్మ గార్ల ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు నిర్వహించారు. జాతరకు చుట్టు పక్కల ప్రాంతాల నుంచే కాకుండా కర్ణాటక నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని, మొక్కులు చెల్లించుకున్నారు.

గడేహోతూరులో బయటపడిన అక్రమాలు

వజ్రకరూరు: గడేహోతూరులో మంగళవారం ఏర్పాటు చేసిన ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదికలో అక్రమాలు బయటపడ్డాయి. 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు గ్రామంలో చేపట్టిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీలు నిర్వహించారు. ఈనెల 28 నుంచి మంగళవారం వరకు సామాజిక తనిఖీ బృందం క్షేత్ర స్థాయిలో పర్యటించి తనిఖీలు చేసింది. మంగళవారం ఏర్పాటు చేసిన గ్రామసభలో తనిఖీల్లో గుర్తించిన అవకతవకలను డీఆర్పీ సంజన్న చదివి వినిపించారు. మస్టర్లలో కూలీల సంతకాలు లేవని, పొలాల్లో బౌండ్రి ట్రెంచులు (సరిహద్దు కందకాలు) కనిపించలేదని, మొక్కలు నాటినట్లు ఎక్కడా కనిపించలేదని వెల్లడించారు. పీఎస్ఏ రఘు, ఎఫ్ఏ రామాంజనేయులు పాల్గొన్నారు.

గొడుగుల పంపిణీ

ఉరవకొండ: ఉరవకొండ క్లాక్ టవర్ వద్ద చిరువ్యాపారులకు అభయ ఫౌండేషన్ సౌజన్యంతో గొడుగులను నిస్వార్థ ఫౌండేషన్ పంపిణీ చేసింది. ఉరవకొండ ఎస్ఐ జనార్దన్‌నాయుడు, ఏఎస్ఐ పాల్ చేతుల మీదుగా అందించారు. నిస్వార్థ ఫౌండేషన్ ప్రతినిధి తాటికొండ వెంకట్, జైకిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నాగమల్లి ఓబుళేసు ఆధ్వర్యంలో వందలాది మందికి గొడు గులు పంపిణీ చేశారు. ఫౌండేషన్ సభ్యులు వెంకట్, ఓబుళేసులు మాట్లాడారు.